క్లుప్తంగా

నేడు గోదారంగనాథస్వామి కల్యాణం

నంగునూరు(సిద్దిపేట): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పాలమాకులలోని వేంకటేశ్వరాలయంలో సోమవారం గోదా రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణం, తీర్థప్రసాద, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేటలోని వికాస తరంగిణి సభ్యులు హాజరవుతారని, కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ భిక్షపతి

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని వీరన్నపేట గ్రామంలో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కొండపాక భిక్షపతి ఎమ్మెల్సీ డాక్టర్ బండ్రప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు.

స్నేహితురాలికి చేయూత



లక్ష్మికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

కొమురవెల్లి(సిద్దిపేట): పూర్వ విద్యార్థులు తమతో పాటు చదివిన స్నేహితురాలికి తమ వంతు చేయూతనందించి స్నేహానికి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని మర్రిముచ్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరం పదో తరగతి తమతో పాటు చదువుకున్న లక్ష్మి తమ భర్తను కోల్పోయిన విషయం తెలుసుకొని ఆదివారం రూ.40వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఆకుల రమేశ్, శిక శ్రీకాంత్‌గౌడ్, పుల్లం బాలకృష్ణ గౌడ్, శ్రీనివాస్‌చారి, ఎలికట్టె కృష్ణ, చుంచు నాగరాజు, దాసరి పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శత రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలోని రుద్రేశ్వర ఆలయంలో ఆదివారం రుద్రేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకం కనుల పండువగా సాగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి అనంతరం తీర్థ ప్రసాద, అన్నదాత వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జెడ్పీటీసీ



శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ యాదగిరి, తదితరులు

దుబ్బాక: రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్‌ను, ఎమ్మెల్సీ డాక్టర్ బండ ప్రకాశ్‌ను ఆదివారం రాయపోల్ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, ముదిరాజ్ నాయకులు దమ్ముగారి కనకయ్య కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో బలమైన శక్తిగా ఎదగడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంగునూరు(సిద్దిపేట): ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందాలనుకునే అభ్యాసకులు సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ దేశిరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 13 వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా నంగునూరు ఉన్నత పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్ 9912959850 నంబర్‌లో, పాఠశాలలో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పథంలో వితలాపూర్

- మంత్రి చొరవ, గ్రామస్తుల సహకారంతో అన్నింటా ఆదర్శం
- కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు
- రోడ్డుకిరువైపులా పచ్చని తోరణాలు



గ్రామంలో నిర్మించిన గోదాము



పల్లె ప్రకృతి వనంలో ఆట వస్తువులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఒకప్పటి కల్లోల మారుమూల పల్లె.. నిత్యం తుపాకి మోతలు.. బూట్ల చప్పుళ్లు.. ఎన్‌కౌంటర్‌లతో అట్టుకుడికిన వితలాపూర్ నేడు అభివృద్ధి పథంలో పయనిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. జిల్లా సరిహద్దు గ్రామమైన వితలాపూర్‌లో జరిగిన అభివృద్ధి పనులతో పట్టణాన్ని తలపిస్తోంది. గడిచిన మూడేళ్లలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయి.

- మండలంలోని వితలాపూర్ గ్రామంలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.
- గ్రామానికి వెళ్లేటప్పుడు రోడ్డుకిరువైపులా పచ్చని మొక్కలు.. ఓవైపు సంపూర్ణ పారిశుద్ధ్యం .. మరోవైపు అభివృద్ధి పనులు.. వందశాతం సీసీరోడ్లు, ధాన్యం నిల్వచేసే 10వేల మెట్రిక్ టన్నుల గోదాం, రైతువేదిక, రైతు బజార్, స్మశానవాటిక, డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతి వనంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆహ్లాదం కలిగించే పూల మొక్కలతో అందంగా పరిసరాలను తీర్చిదిద్దారు.
- పిల్లల ఆటవస్తువులు, వాకింగ్ చేయడానికి అనువుగా వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయడం ఇలా అన్ని సౌకర్యాలతో ప్రగతి పథంలో ముందుకు సాగుతోంది.

పచ్చని పంట పొలాలు..

పచ్చని పొలాల మధ్య ఆహ్లాదాన్ని పంచుతూ ప్రకృతి ఒడిలో ఒదిగిపోయిన గ్రామం వితలాపూర్. ఒకప్పుడు తాగడానికి గుక్కెడు నీరు దొరకని పల్లె. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగు, తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. దీంతో గ్రామంలో పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడ్డ వీరు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ అనుబంధాలను పంచుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు.

అందరి సహకారంతోనే..



గ్రామం అభివృద్ధి వెనక మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ, గ్రామస్తుల సహకారం ఎంతో ఉంది. అందరి సహకారంతో గ్రామం అన్నింటా ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకం ఇక్కడ అమలవుతోంది. ఇంకా చేపట్టాల్సిన పనులు గుర్తించి గ్రామాభివృద్ధికి సహకరిస్తాం.

– నవీన్, సర్పంచ్

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలతో శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని పెద్దమాసాన్‌పల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎల్లారెడ్డిపేట, బండారుపల్లి గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి వందమంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై భారం మోపిందన్నారు. కార్యకర్తలు పార్టీకి ప్రాణ సమానులనీ వారికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని హామీనిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా ఈ నెల 23న చేపట్టే పాదయాత్ర విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింలు, వెంకట్‌రెడ్డి, నవీన్, కర్ణాకర్, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు



సమ్మేళనంలో విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లికి చెందిన ఎస్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ 10వ తరగతి 2000–2001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఓ ప్రైవేట్ రిసార్టులో జరిగింది. ఈ సందర్భంగా ఒకరికొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబ పరిస్థితుల గూర్చి చర్చించుకుంటూ అప్పటి ప్రేమాభిమానాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఎంతో అరుదైన విషయమన్నారు. బతుకు దెరువు, ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ మళ్లీ ఒకచోట కలుసుకునే భాగ్యం దొరకడం అదృష్టమన్నారు. అనంతరం అందరు కలిసి భోజనాన్ని స్వీకరించి ఆనందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వినోద్, విక్రమ్, గీతా, జ్యోతి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలోని నేతాజీ స్కూల్‌కు చెందిన 1998–99 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వారు చదువుకునే రోజులు, చేసే అల్లరి, స్నేహితులతో కలిసి ఆడిన ఆటలు అవన్నీ గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను గౌరవించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ సుభాశ్, ఇతర ఉపాధ్యాయులు అమర్‌నాథరావు, జనార్దన్, భూపతిరెడ్డి, వంగ వెంకట్రామిరెడ్డి, వంగ మహేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజు, మనోజ, జ్యోతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థల కేటాయింపు



ఆర్డర్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో నిర్మించ తలపెట్టిన డా.బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తూ దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు దుబ్బాక క్యాంపు కార్యాలయంలో ఆదివారం దళిత సంఘాల నాయకులకు ల్యాండ్ అలాట్‌మెంట్ ఆర్డర్ కాపీ పత్రాలను అందజేశారు. చాలా కాలం తర్వాత మిరుదొడ్డిలో నిర్మించే అంబేడ్కర్ భవన నిర్మాణానికి రెండు గుంటల స్థలం కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దెల రోశయ్య, మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, దళిత సంఘాల నాయకులు మద్దెల రాజేశ్, అల్లిబిల్లి కుమార్, నక్క రాములు, మద్దెల మల్లేశం, పొడేటి మహేష్, మద్దెల చంద్రం, మద్దెల లక్ష్మయ్య, శేఖర్, నర్సింహులు, మంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'ముందస్తు అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధం'

కొండపాక(గజ్వేల్): ప్రజా సమస్యల పరిష్కార విషయమై ప్రతిపక్షాలు నిరసనలు తెలపకుండా ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఎర్రవల్లి ఎంపీటీసీ సభ్యురాలు విరుపాక ప్రణవీరెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి కొండపాక మండల వ్యాప్తంగా నిర్మించిన డబుల్ ఇళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా అనర్హులకు చోటు దక్కిందన్నారు. మేదినీపూర్‌లో డబుల్ ఇళ్ల నిర్మాణాలకు స్థలం అప్పగించిన బాధితులకు ఇల్లు కేటాయించకపోవడం దారుణమన్నారు. మేదినీపూర్ గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన 50 డబుల్ బెడ్రూంల లబ్ధిదారుల ఎంపికలు గ్రామసభ ద్వారా మరోమారు చేసి అర్హులకు దక్కేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవీంద్రనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన 50 డబుల్ బెడ్రూంలు కేవలం మధిర గ్రామమైన విశ్వనాథపల్లి గ్రామస్తులకే పంపిణీ చేయడం దారుణమన్నారు.

కూడవెల్లి సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దుబ్బాకరూరల్: మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే రఘునందన్‌రావు సందర్శించారు. రాబోయే మాఘ అమావాస్య జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గుడి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. జాతరకు ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున్న భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకించి వలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విశ్వనాథశర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామశాఖ అధ్యక్షులను చిన్నచూపు చూడటం సరికాదు



మాట్లాడుతున్న గ్రామ శాఖ అధ్యక్షులు

కొండపాక(గజ్వేల్): పార్టీ బలోపేతం కోసం కష్టపడుతున్న గ్రామ శాఖ అధ్యక్షులను చిన్న చూపు చూడటం పాలకులకు తగదని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు రాము, జిర్ర రాజులు హెచ్చరించారు. కొండపాక మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులు కలిసి సమావేశమై ఈ విషయమై తీవ్రంగా చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమాల్లో సమాచారం ఇవ్వకుండా అగౌరవపరుస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏ కార్యక్రమం తలపెట్టిన ముందుండి విజయవంతం చేసేది గ్రామ శాఖ అధ్యక్షులేనన్నారు. తమ ఆవేదనను ముందుగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇలాగే పునరావృత్తం అయితే అసలైన సమయంలో తమ సత్తా ఏంటో చూపుతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్థికసాయం అందిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూనే మంచి సత్ఫలితాలను సాధించాలని డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి జాతీయ స్థాయి హైజంప్‌కు ఎంపికైన బోయిని నందుకు రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. అనంతరం మండల పరిధిలోని కూడవెల్లి గ్రామానికి చెందిన ఎనగంటి ముత్తయ్యకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రభాకర్, నాయకులు బాలాగౌడ్, దుర్గారెడ్డి, దుబ్బరాజం,శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి వరమని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సిద్దిపేటఅర్బన్, సిద్దిపేటరూరల్ మండలాల వివిధ గ్రామాల్లోని 189 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలు ఏనాడైనా ఇలాంటి సంక్షేమ పథకాలను ఇచ్చిన దాఖలాలు లేవని గత ప్రభుత్వాల తీరును మంత్రి విమర్శించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సిద్దిపేట ప్రభుత్వ దవాఖానాలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీ గర్భిణీకి నార్మల్ డెలివరీ చేయించి, మొదటి గంటలోపే తల్లిపాలు తాగించాలని కోరారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటాం..

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని చింతమడక, జక్కాపూర్, పట్టణంలోని 13వ వార్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ.2లక్షలు చొప్పున పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా రూ.6లక్షల చెక్కులను ఆయన అందించారు. నియోజకవర్గస్థాయిలో ఇప్పటికే ప్రమాదంలో మృతి చెందిన 41 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా రూ.82లక్షల రూపాయల ఆర్థికసాయం అందజేసినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, సుడా డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, ఆత్మ కమిటీ చైర్మన్ వర్మ, కౌన్సిలర్లు ఆనంద్, తిరుమాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గైనిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆస్పత్రి సిబ్బందితో ఎస్ఐ నరేందర్‌రెడ్డి

కోహెడ(హుస్నాబాద్): మండల ప్రజలు గైనిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా సమీపంలోని సాయికృష్ణ ప్రైవేట్ ఆస్పత్రిలో అదనంగా గైనిక్ సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. గర్భిణుల వైద్య సేవలకు డాక్టర్ జి.దేవి ప్రతి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు వైద్య ఖర్చు ఆదా చేసేందుకు ఎంబీబీఎస్ వైద్యురాలిని ఆస్పత్రికి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ దయాకర్, ఆస్పత్రి నిర్వాహకుడు కనగండ్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గోరిట్యాల లక్ష్మణ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి చేస్తాం

జిల్లా అధ్యక్షుడు రాంలింగారెడ్డి



మాట్లాడుతున్న రాంలింగారెడ్డి

హుస్నాబాద్: వైఎస్సార్‌టీపీని జిల్లాలో బలోపేతం చేస్తామని, రానున్న శాసనసభ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో బరిలో ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెదిని రాంలింగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ప్రజాపోరాటాలు చేసే వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తోందని, అధికారం శాశ్వతం కాదని బీఆర్ఎస్ పార్టీ తెలుసుకోవాలన్నారు. తెలంగాణలో రాజన్న రాజ్యం తెచ్చి రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేస్తామన్నారు. వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజా సమస్యలపై పాదయాత్ర చేస్తుంటే ప్రజల నుంచి వచ్చే ఆదరణ చూసి ఓర్వలేక ప్రభుత్వం పాదయాత్రను అడ్డుకొని ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. జిల్లాలో త్వరలోనే పార్టీ గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేస్తామని రాంలింగారెడ్డి అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, జిల్లా నాయకులు స్వామినాథ్, నాగరాజు, కోడేల రాజు, గుట్టు సాయి, దామిడి చంద్రారెడ్డి, రమేశ్, రాగుల రాంరెడ్డి, రవి, మల్లేశం, ఎర్రబెల్లి రాజయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

గజ్వేల్‌రూరల్: కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్‌లోని 3వ వార్డుకు చెందిన బూషన్నగారి నరేశ్‌గౌడ్‌కు భార్య దీప, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నరేశ్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.3500 విలువైన నిత్యావసర సరుకులతో పాటు రూ.6500 నగదును అందించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ అధ్యక్షుడు గుర్రం తులసీదాస్, ఉపాధ్యక్షుడు యాదగిరి, సభ్యులు గుంటుకు శ్రీనివాస్, ఆంజనేయులు, రమేశ్, నర్సింలు, సంతోష్, శ్రీనివాస్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పేద సంఘాల బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటాద్రి

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామీణ పేద సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెన్నబోయిన వెంకటాద్రి అన్నారు. ఆదివారం మండలంలోని కేశవాపూర్ గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ పేదలకు డబుల్ బెడ్రూం, మూడెకరాల భూమి పంపిణీ, దళితబంధు వంటి ప్రభుత్వ పథకాలు ప్రతీ పేద ప్రజలకు చేరాలన్నారు. పేద, మధ్య తరగతి రైతులు ఇతర చేతి వృత్తులవారు సరైన కూలీలు, యాజమానులు ధనదాహానికి తమ శ్రమలో అత్యధిక శక్తి దారపోస్తూ దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారన్నారు. ఈ వ్యవస్థ మార్పుకు గ్రామీణ పేద సంఘాలు తీవ్రమైన కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పడిగ ఎర్రయ్య, మత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



బహుమతులు అందిస్తున్న అసోసియేషన్‌ల సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంక్రాంతిని పురస్కరించుకొని సిద్దిపేట వాసవి, వనితా క్లబ్, యూత్ క్లబ్, రైస్ మిల్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా విచ్చేసిన భవాని క్లాసికల్ డ్యాన్స్ నిర్వాహకురాలు భవాని, భారతీయ స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ స్వాతిలు న్యాయమూర్తులుగా వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదు కన్సోలేషన్, ముగ్గులు వేసిన ప్రతీ ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్, కోర్తివాడ రాజేందర్, గంప కృష్ణమూర్తి, యాద శ్రీనివాస్, పుల్లూరి శివకుమార్, మంకాల శ్రీనివాస్, శివ్వ శ్రీనివాస్, తడకమడ్ల శంకరయ్య, పుల్లూరి శశాంక్, నేతి వేణుకుమార్, పూల్లూరి శ్రీనివాస్, చింత రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి, అర్వపల్లి హరికిరణ్, చకిలం రవి, కొమరవెల్లి కల్పన, బూరుగు వేణుగోపాల్, భూమి రాజు, అయిత శంకర్, మర్యాల వీరేశం, తిమ్మిశెట్టి వీరేశం, పుల్లూరి సుష్మ, మర్యాల వాణి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రియదర్శిని సొసైటీ సభ్యులు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలమల్లు, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, కోశాధికారి మోహన్, ఉపాధ్యక్షుడు రాజు, కార్యవర్గ సభ్యులు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.